క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొయ్యూరు: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు పది మంది హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే వచ్చారని, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు తెలిపారు. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సెకండియర్ పరీక్షలకు పది మందికి అంతా హాజరైనట్టు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన తెలిపారు.

విద్యార్థులకు యోగా పోటీలు


యోగా పోటీల్లో విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథలయాకారి శెట్టి సునీత ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతులకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని, శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ


బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న దాత జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని బొడ్రాయిగూడెంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వితరణ అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆఫ్రిన్ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ ట్రస్ట్ తరఫున బాధితులకు నిత్యావసరాలతో పాటు దుస్తులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన బాధితులను ఓదార్చారు. తమ ట్రస్ట్ తరఫున మరింత సాయమందిస్తామని భరోసానిచ్చారు. ప్రమాదంలో కుట్టుమిషన్ కాలిపోవడంతో ఆదాయం కోల్పోయిన పులి శాంత అనే మహిళకు ఆశా స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి ఎస్‌డీ సుభాని కుట్టుమిషన్‌ను అందజేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలు పరిష్కరించాలి


కుళాయిలను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను గిరిజన సంఘం ప్రతినిధులు కిల్లో సురేంద్ర, బాలదేవ్‌లు బుధవారం సందర్శించారు. కాంప్లెక్స్‌లో తాగునీరు, మరుగుదొడ్ల పైపులైన్ పాడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పైపులైన్ మరమ్మతు చేసి సమస్యపరిష్కరించాలని కోరారు.

దుమ్ము ధూళితో సతమతం


చిలకలగెడ్డ గేటు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద ఎగసిపడుతున్న దుమ్ము

అనంతగిరి: మండలంలోని వెంకయ్యపాలెం నుంచి బొడ్డవర వరకు జరుగుతున్న ఎన్‌హెచ్‌5 రోడ్డు విస్తరణ పనుల్లో దుమ్ముధూళితో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకయ్యపాలెం, చిలకలగెడ్డ సమీపంలోని మూడు ప్రదేశాల్లో కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాహనాలు వెళ్లే సమయంలోని పెద్ద ఎత్తున దుమ్ముధూళి వెదజల్లుతోంది. దీంతో ద్విచక్రవాహనచోదకులు ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు పనులు దుమ్ముధూళి పైకి లేవకుండా నీటి ట్యాంకర్‌తో ఎప్పటికప్పుడు రోడ్డును తడపాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గిరిజనుడికి అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- గడప గడపకు విశేష ఆదరణ
- గ్రామాల్లో ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ విస్తృత పర్యటన

గూడెంకొత్తవీధి: గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రింతాడ సచివాలయం పరిధిలోని ముల్లుమెట్ట, ఊబపాలం, చీమలబంద, ఈదురుబయలు గ్రామాల్లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కాలినడకన పర్యటించారు. ఆయా గ్రామాల్లో 186 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధితో సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసేందుకు వైఎస్సార్‌సీపీకి గిరిజనులంతా మద్దతు తెలియజేయాలని కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు లక్ష్మి, సుభద్ర, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీటీసీ నాగమణి, ఏఎంసీ డైరెక్టర్ త్రిమూర్తులు, నాయకులు కృష్ణారావు, వీరేంద్రప్రసాద్, ఈశ్వరమ్మ, అంజి, ప్రసాద్, రాజేష్, రాజులమ్మ, లోవలక్ష్మి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

అరకులోయ రూరల్: రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమం పాలన అందించడం సీఎం జగనన్నతోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ఇరగాయి, బొండుగూడ, కుందిగూడ గ్రామాల్లో బుధవారం జరిగిన గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 130 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఏజెన్సీ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయం భవనం పూర్తి చేయాలని, ఉరుములు గ్రామంలో రోడ్డు మరమ్మతు చేయాలని, ఇరగాయి పంచాయతీలో పాఠశాల భవనం బాగు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ సెల్, చేనేత విభాగ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లు బుటిక్, రాధిక, నాయకులు శెట్టి అప్పాలు, రఘునాథ్, రామారావు, యాసీన్, సాంబ, నగేష్, రమేష్, రంజిత్‌కుమార్, మొస్య, సుంక్ర తదితరులు పాల్గొన్నారు.

సోమాలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు


సోమాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: అడ్డతీగలలో వేంచేసిన సోమాలమ్మ అమ్మవారి జాతర నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను ఈనెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తున్నారు. ఆలయానికి వచ్చే రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మొదటి రోజు ఆలయం వద్ద సాయంత్రం 6 గంటలకు లలితా సత్సంగ్ వారిచే భజన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. 29న మధ్యాహ్నం అమ్మవారి హుండీ వేలంపాట, అనంతరం అమ్మవారి ఊయట ఊరేగింపు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషదారణలు, డప్పు వాయిద్యాల నడుమ అత్యంత వైభవోపేతంగా ఊయల ఊరేగింపు చేస్తారు. అదే రోజు రాత్రి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 30 న కాంతారా నృత్యం, కాళికా నృత్యం,గరగ నృత్యాలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 31న ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం జరుగుతుందని, అదే రోజు సంగీత విభావరి, కోలాటం వంటివి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 1 న భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారి దర్శనంతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులకు విత్తనాల పంపిణీ


అడుగులపుట్టులో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు


జి.మాడుగులలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న నేతలు వెంకటగంగరాజు

పెదబయలు: గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు అన్నారు. అడుగుపుట్టులో బుధవారం గిరిజన రైతులకు వరి విత్తనాలను ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు పంపిణీ చేశారు. మండలంలోని 700 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, 90శాతం సబ్సిడీతో నాణ్యమైన వరి విత్తనాలను పంపిణీ చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఏవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొర్రా రాజబాబు, సర్పంచ్ అశోక్, నాయకులు కనకరాజు, కృష్ణారావు, పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తనాలతో అధిక దిగుబడులు

జి.మాడుగుల: ప్రభుత్వం సబ్సిడీపై గిరిజన రైతులకు అందిస్తున్న నవధాన్యాల విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలని సర్పంచ్ కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం గిరిజన రైతులకు నవధాన్యాల కిట్లును వారు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పాత్రుడు సాలభం, సర్పంచ్‌లు హనుమంతరావు, కొండబాబు, ఎంపీటీసీలు విజయకుమారి, సన్యాసిదొర, మండల పార్టీ అధ్యక్షుడు, పీఎసీఎస్ చైర్మపర్సన్ ఎస్.మత్స్యకొండంనాయుడు, జేబీఎన్ఎఫ్ ఎంటీ జె.వెంకటరావు, జి.మాడుగుల యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి, ప్రసాద్, పాపారావు, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు

- పైపులైన్‌లో సాంకేతిక లోపం
- నిలిచిన పెట్రోల్ పంపింగ్


అమ్మకాలు నిలిచిపోవడంతో బోసిపోయిన పెట్రోల్ బంకు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థకు చెందిన పెట్రోలు బంకు రెండు రోజులుగా పనిచేయడం లేదు. ఇక్కడ పెట్రోలు బంకులో సంపునకు సంబంధించిన పైపులు రెండూ పనిచేయడం లేదు. దీంతో పెట్రోల్ పంపింగ్ నిలిచిపోయింది. ఫలితంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీటరు పెట్రోలు ధర బయట మార్కెట్‌లో రూ.130 నుంచి రూ.140 వరకూ అమ్ముతున్నారు. దీంతో వినియోగదారులపై అదనపు భారం పడుతుంది. పెట్రోల్ బంకు నిర్వహణపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై జీసీసీ బంకు మేనేజర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పైపులైన్‌లో సాంకేతిక లోపం కారణంగా పంపింగ్ నిలిచిపోయిందని, త్వరలో సమస్య పరిష్కరించి, బంకు సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

వీరవల్లి అగ్రహారంలో అమ్మవారి దీక్షలు


మోదమాంబ పీఠంలో దీక్షలో ఉన్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారం మోదమాంబ అమ్మవారి పీఠంలో అమ్మవారి దీక్షలను ప్రారంభించినట్టు పాలకుర్తి శ్రీనివాసరావు, మంగరాజు బుధవారం తెలిపారు. 30 మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేశారు. ప్రతి రోజు, ఉదయం సాయంత్రం పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 28న అమ్మవారికి 101 బిందెల నీళ్లతో అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. 30న అమ్మవారి ఘటాల సంబరం, సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 4వ తేదీన గ్రామం నుంచి కాలినడకన మాడుగులకు వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం సతకం పట్టు వద్ద దీక్షా కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో వంతాల, పెదలోచలి పంచాయితీల్లో రెండు బీటీ రోడ్లు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్‌లు బి.చినకుమారి, జి.పద్మ ప్రారంభించారు. ఆయా గ్రామస్తుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో ఆయా గ్రామస్తులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల గ్రామ సచివాలయ కన్వీనర్ ఎల్.కళ్యాణం, మాజీ సర్పంచ్ కొండబాబు, వైస్ ఎంపీపీ కళ్యాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండబాబు, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, సాలభం ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.సింహాచలం పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె



దీక్ష చేస్తున్న హమాలీలు

జి.మాడుగుల: పాడేరు, రంపచోడవరం జీసీసీ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న హమాలీలు తమకు బకాయి ఏరియర్స్ చెల్లించాలని కోరుతూ బుధవారం రెండో రోజు సమ్మె చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.పండుబాబు మాట్లాడుతూ బకాయి ఏరియర్స్ చెల్లించాలని, హమాలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. బాబూరావు, సత్తిబాబు, శ్రీనుబాబు, బుజ్జిబాబు, సురేష్, సుమన్, త్రినాథ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ నేతల నిరసన నేడు

సాక్షి,పాడేరు: రంపచోడవరం ప్రాంతంలో ఆదివాసీ జేఏసీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని, జేఏసీ జిల్లా జిల్లా కన్వీనర్ రామారావుదొర, నేతలు బుధవారం ఓ ప్రకటనలో ఖండించారు. జిల్లా కేంద్రం పాడేరులో గురువారం నిరసన కార్యక్రమం జరుగుతుందని, అన్ని సంఘాల నేతలు తరలిరావాలని కోరారు.

బియ్యం సక్రమంగా అందించాలని వినతి

చింతపల్లి: మండలంలోని కుడుమసారి పంచాయతీలో ఉచిత బియ్యం అందకపోవడంపై గిరిజనులు ఆందోళన చేశారు . రెండు నెలలుగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించడం లేదని గిరిజనులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకులున్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు


కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక కల్యాణోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం పెళ్లిరాట కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 30న పుట్టమన్ను తేవడం, నిజరూపదర్శనం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 31న ఎదురుసన్నాహం అనంతరం వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 4వ తేదీ ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగిస్తాయని వారు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

శరవేగంగా అభివృద్ధి పనులు


రేగం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

అనంతగిరి: మన్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ శాఖల భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, పీహెచ్‌సీలు, పశు సంవర్ధకశాఖ భవనాలు, మండల పరిషత్ కార్యాలయాలు, విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర భవనాలున్నాయి. దీంతో పాటు ఏజెన్సీలోని శివారు గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోట్లాది రూపాయలు మంజూరు చేసింది. శివారు గ్రామాలకు కూడా రోడ్లు నిర్మిస్తుండడంతో రవాణా సౌకర్యాలు మరింత మెరుగవుతున్నాయి. మన్యప్రాంతం అభివృద్ధి పథం వైపు పరుగులు తీస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మన్య ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై గిరిజనులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి మండలం నాడు–నేడు మొదటి విడతలో 40 పాఠశాలలు రూ.9.69 కోట్లతో పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో 46 పాఠశాలలు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు రూ.10.39 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రెండో విడతలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.60.70 లక్షల మంజూరు చేశారు. రెండో విడతలోని నాడు–నేడు ద్వారా నూతన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో హర్షనీయమంటూ విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు


ప్రభుత్వ కళాశాలలో నాడు–నేడు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరావు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామమైన పరగసానిపాడు ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను ఎంఈవో వై.మల్లేశ్వరరావు బుధవారం పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి వంటగది, మరుగుదొడ్లు, విద్యుత్ పనులకు గాను రూ.4.20లక్షలతో మంజూరైనట్టు తెలిపారు. ఆయా పనులు ప్రస్తుతం పూర్తయ్యాయమన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలకు అందించామన్నారు.. మండల వ్యాప్తంగా 25,617 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటివరకూ 15,704 సరఫరా జరిగిందని, మిగిలినవి త్వరలో సరఫరా కానున్నట్టు తెలిపారు.

హుకుంపేట: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంపీడీవో వెంకటరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమణాలు పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు తదితరులున్నారు.

చెరువు పనులకు భూమిపూజ


పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రమేష్, సర్పంచ్ బాలరాజు, ఇతరులు

కొయ్యూరు: మండల కేంద్రంతో పాటు మంప ప్రాంతాల్లో చెరువు నిర్మాణ పనులకు ఎంపీపీ బడుగు రమేష్ బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచేందుకు వాటర్‌షెడ్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.సారవంతమైన మట్టిని కొట్టుకుపోనివ్వకుండా ఇది కాపాడుతుందన్నారు. వర్షాకాలంలో కొండలపై నుంచి వస్తున్న నీటిని వడిసిపట్టేందుకు, చెరువులో నిల్వ ఉంచడంతో భూగర్భ జలాలను పెంచేందుకు వీలు పడుతుందన్నారు. ఇది పరోక్షంగా రైతులకు మేలు చేస్తుందన్నారు. భూమి కోతకు గురికాకుండా నివారిస్తోందని, పచ్చదనం పెంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. మంప, రేవళ్లు, కొయ్యూరు, మర్రివాడ, రావణాపల్లి ప్రాంతాల్లో చెరువు నిర్మాణ పనులు మంజూరయ్యాయన్నారు. పండ్ల తోటలు పెంచే రైతులకు ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మాకాడ బాలరాజు, సభ్యులు కొండలరావు, లక్ష్మణరావు, గీత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం


ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని అరకు మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.రామదాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికై నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకు మార్కట్ యార్డు డైరెక్టర్ కిరసాని రామదాస్ మాట్లాడుతూ 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 175 స్థానాల్లో విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. జగనన్న పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. రాష్ట్ర ప్రజానీకం నిత్యం వైఎస్సార్‌సీపీ పక్షనే ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు జగబంధు, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతిరావు, పిత్‌భాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి జాతర

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురం గ్రామంలో గంగాలమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో పిల్లలు పెద్దలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకొన్నాయి. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకొంటు గంగాలమ్మ సంబరాలను స్థానికులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ వేడుకలో అమ్మవారి ఘటాన్ని ఓ చిన్నారి తలపై ఉంచి డప్పువాయిద్యాలు, బాణాసంచాల వెలుగులో ప్రజలంతా ఊరేగారు. ఒకరిపై మరొకరు పసుపునీరు చల్లుకొంటూ, వసంతం ఆడుతూ సందడి చేశారు. అనంతరం అమ్మవారి గుడి వద్ద పరిసరాలు శుభ్రం చేసి చలువ పందిళ్లు వేశారు. పండ్లు, పూలు రకరకాల పిండివంటలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి


నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి వాసురాజుని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రోలుగుంట: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసురాజు చెప్పారు. కొవ్వూరు నూకాల తల్లి గుడి వద్ద బుధవారం నాయీ బ్రాహ్మణుల సంఘం మండల స్థాయిలో కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఉప్పలపు వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా నర్సింగరావు, ప్రధానకార్యదర్శిగా ఉప్పలపు గణపతి, గౌరవ అధ్యక్షుడిగా యర్రవరపు అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉప్పలపు మురళి, కోశాధికారిగా అచ్చిబాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీని వాసురాజు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతలడ లక్ష్మీ రమణమ్మకు తెలియజేసినట్టు చెప్పారు.